# మరింత అభివృద్ధి కావాలంటే
# మల్లన్న గెలవాలి

## బలహీన వర్గాల అభ్యర్థికి మరోసారి అవకాశం ఇవ్వండి

**వంద కోట్ల నిధులు కాదు.. అడిగినవన్నీ వస్తయ్**

**మోతె, మునగాల, నడిగూడెం మండలాలకు కాళేశ్వరం జలాలు వచ్చాయి**

**11 సార్లు అవకాశం ఇచ్చినా కాంగ్రెస్ ఏమీ చేయలేదు**

**కోదాడ రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్**

**బీఆర్ఎస్ బలగంతో గులాబీ మయమైన కోదాడ**

సూర్యాపేట, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : 'కోదాడకు బొల్లం మల్లన్న వచ్చిన తరువాత ఎలా ఉంది. గతంలో 11 సార్లు అవకాశం ఇస్తే 55 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ హయాంలో ఏం జరిగిందో అంతా మీ కళ్ల ముందే ఉన్నది. నేడు కోదాడ ఎంతో సర్వాంగ సుందరంగా మారుతుంది. నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వరం టేలెండ్ ప్రాంతాలకు గోదావరి జలాలు వస్తున్నాయి. ట్యాంక్‌బండ్, రోడ్లు, డివైడర్లు, గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఇలా ఎన్నో జరిగాయి.' అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మరి ఈ ఎన్నికల్లో అభివృద్ధికి పాటుపడే మల్లన్నను గెలిపించుకుందామా.. లేక అభివృద్ధి అడ్రస్ తెలియని కాంగ్రెస్‌కు ఓటేద్దామా? అని ప్రశ్నించారు. మళ్లీ మల్లన్న గెలిస్తే ఆయన అడిగినట్లు వంద కోట్ల రూపాయలు, హైటెక్ బస్టాండ్, పాలిటెక్నిక్ కళాశాల ఏదైనా వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి బుధవారం కోదాడ పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి రంగా థియేటర్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి వచ్చారు. రంగా థియేటర్ చౌరస్తా వద్ద ప్రజలనుద్దేశించి మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ఆయన మాటల్లోనే.. 'బొల్లం మల్లయ్య మీలోంచి వచ్చిన వ్యక్తి. అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన బలహీన వర్గాల బిడ్డ. అవతల పెద్దపెద్ద దొరలు, పెత్తందారులు ఒక్కటవుతున్నరు. మల్లన్నను ఓడించాలని కుట్రలు చేస్తున్నారు. డబ్బు సంచులతో దిగుతున్నారు. చుట్టపు చూపుగా వచ్చే వారి గురించి ఆలోచిద్దామా.. ఇక్కడుండే వారి గురించి ఆలోచిద్దామా? అభివృద్ధిని కాంక్షిస్తూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్న మల్లన్నను కాపాడుకుంటరా?' అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించగా.. కాపాడుకుంటామని జనం నినదించారు.



కోదాడ రోడ్‌షోలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

### మల్లన్నను గెలిపించండి.. అన్ని ఇచ్చే బాధ్యత తీసుకుంటా

కోదాడలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్‌ను గెలిపించండి.. ఏది కావాలన్నా ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి కేటీఆర్ అన్నారు. కోదాడకు వంద కోట్లు రావాలన్నా, పాలిటెక్నిక్ కళాశాల, హైటెక్ బస్టాండ్ కావాలన్నా మల్లన్న గెలిస్తే వచ్చి తీరుతాయన్నారు. డబ్బులకు ఆశపడొద్దు.. బలహీన వర్గాల బిడ్డను గెలిపిస్తే ఇప్పుడు జరిగిన అభివృద్ధికి రెట్టింపు జరుగడం ఖాయమని హామీ ఇచ్చారు. కనీవిని ఎరుగని రీతిలో వచ్చిన జన సందోహం, వారి ఉత్సాహం చూస్తుంటే ప్రచార ర్యాలీలా కాకుండా మల్లన్న విజయోత్సవ ర్యాలీని తలపిస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

### 55 ఏండ్లు చేసిందేమీ లేదు.. ఇప్పుడేదో చేస్తారట

'గాడిదలకు మేత వేసి ఆవులకు పాలు పిండితే వస్తాయా.. కాంగ్రెస్‌కు ఓటేసి పనులు కావాలంటే కావు. 2014కు మునుపు ఈ రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్సే. ఇవ్వాల వచ్చి ఒక్క చాన్స్ అంటున్నారు. వాళ్లకు ఇచ్చింది 11 చాన్స్‌లు. 55 ఏండ్లు రాష్ట్రం వాళ్ల చేతుల్లోనే ఉన్నది. 2014కు ముందు కోదాడ ఎలా ఉండేది? గుంతల రోడ్లు, మురికి వాడలు, విద్యుత్ కోతలతో కాలిపోయిన మోటర్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, అర్ధరాత్రి ఇచ్చే కరెంటు. చెప్పింది ఆరు గంటలు.. ఇచ్చింది మూడు గంటలు. ఎవరైనా చనిపోతే పైరవీలు చేసి 15 నిమిషాల కరెంటు ఇవ్వాలని బతిమాలుకునే దుస్థితి ఉండేది. మరి ఇయ్యాల ఎలా ఉందో మీ కళ్లముందే ఉన్నది.'



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు శశిధర్‌రెడ్డి



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

### తీగలు పట్టుకుంటే తెలుస్తది..

'ఇయ్యాల కరెంటు గురించి రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఇంకా చాలా మంది మాట్లాడుతున్నరు. కేసీఆర్.. మీరిచ్చే కరెంటు కనపడట్లేదు అంటున్నారు. మరి కరెంటు కనపడతదా? ఉత్తమ్, రేవంత్, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, చందర్‌రావు నియోజకవర్గంలో ఏ గ్రామానికైనా వెళ్లి విద్యుత్ వైర్లను పట్టుకుంటే వస్తదో రాదో తెలుస్తది. దీంతో రాష్ట్రానికి పట్టిన కాంగ్రెస్ దరిద్రం కూడా పోతది. ఆనాడు కరెంటు, ఎరువులు, విత్తనాలు, రైతు బంధు ఇవ్వనోళ్లు.. ఇయ్యాల రైతుల మీదు వల్లమాలిన ప్రేమ కనబర్చితే మోసపోదామా?' అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.



## రామన్న పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం

- మరోసారి సేవ చేసేందుకు అసెంబ్లీకి పంపండి
- కోదాడ అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ టౌన్, నవంబర్ 22 : నాడు అయోధ్యరాముడి పాదాల స్పర్శతో రాయి అహల్యగా మారితే.. నేడు మన తారకరాముడి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతోపాటు బీడు భూములు సస్యశ్యామలంగా మారాయని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడలో రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అనేక బహుళ జాతి కంపెనీలను రాష్ట్రానికి రప్పించి లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఐటీ రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారని తెలిపారు. తనపై నమ్మకముంచి గెలిపిస్తే రూ.2400 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. కోదాడ మున్సిపాలిటీని ఇప్పటికే వందల కోట్లతో సుందరీకరించామని చెప్పారు. ఎన్నికల తర్వాత మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి.. మరింత అభివృద్ధి చేస్తానని కోరారు.

### ఒక్కసారి గెలిపిస్తే ఎలా మారింది

'మీ అందరినీ అడిగేది ఒక్కటే. మల్లన్నను ఒక్కసారి గెలిపిస్తే ఎలా మారింది. గ్రామంలా ఉన్న కోదాడలో అనేక పనులు చేసి మంచి పట్టణంలా మార్చారు. సెంట్రల్ లైటింగ్ పెట్టి అందమైన చెట్లతో చక్కగా ఆధునీకరించాం. ట్యాంక్ బండ్ తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేసిన పనులను గుర్తు చేసుకోవాలి. రోడ్లు, పార్కులు, కరెంటు, సాగు, తాగునీటితో పాటు అనేక పనులు మీ కళ్ల ఎదుటే సాక్షాత్కరిస్తున్నది నిజం కాదా?'



కోదాడలో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన గులాబీ శ్రేణులు, పట్టణ ప్రజలు

## కోదాడ గులాబీమయం

**మంత్రి కేటీఆర్ రోడ్ షో గ్రాండ్ సక్సెస్**

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్టణ జనం, పార్టీ శ్రేణులు**

కోదాడ, నవంబర్ 22 : కోదాడ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి బుధవారం మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోకు గులాబీ దండు తరలివచ్చింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలతోపాటు కోదాడ పట్టణం నుంచి వేలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు రావడంతో తెలంగాణ చౌరస్తా గులాబీమయమైంది. బతుకమ్మలు, బోనాలు, కోలాటాలు, డప్పు దరువులు, కోయ జాతి నృత్యాలు అలరించాయి. హెలిప్యాడ్ వద్ద మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. హెలిప్యాడ్ నుంచి ప్రచార రథంపై బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డితో కలిసి ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి ప్రభుత్వ దవాఖాన, బస్టాండ్, మసీద్ కాంప్లెక్స్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు కొనసాగింది. అక్కడ కేటీఆర్‌ను చూసి పార్టీ కార్యకర్తలు పెద్ద పెట్టున కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు హోరెత్తించారు. తిరుమల ఆస్పత్రి వద్ద మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డిని కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. తెలంగాణ చౌరస్తాలో మంత్రి ప్రసంగానికి జనం జేజేలు పలికారు. బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, ప్రభుత్వం ఏర్పడగానే ఆయనకు రాష్ట్ర స్థాయి పదవి ఇస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. మల్లన్న గెలవగానే హామీలన్నీ నెరవేరుస్తామని, పాలిటెక్నిక్ కళాశాల, హైటెక్ బస్టాండ్, కొమరబండ, కోదాడ పెద్ద చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌ల నిర్మాణం, వంద కోట్లతో కోదాడ మున్సిపాలిటీ అభివృద్ధి, జనవరి నుంచే కొత్త రేషన్ కార్డుల మంజూరు, హైటెక్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎన్నికల పరిశీలకుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణ, ఓయూ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కందుల మధు, కోదాడ, నడిగూడెం ఎంపీపీలు చింతా కవితారెడ్డి, యాతాకుల జ్యోతీమధుబాబు, పార్టీ నాయకులు పచ్చిపాల వేణుయాదవ్, అజయ్‌కుమార్, వెంపటి మధు, మామిడి రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.